జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు


మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 61 13-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## ఇంధన కొరత లేదు

- తప్పుడు ప్రచారం మానుకోవాలి
- ఎల్పీజీ ఉత్పత్తిని 28 శాతం పెంచాం
- లోక్‌సభలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడి

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ మనదేశంలో ఇంధన కొరత ఎంతమాత్రం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఏవియేషన్ టర్బైన్ ఇంధన నిల్వలు సరిపడా ఉన్నట్లు తెలిపారు.

2లో

## తెలంగాణలో ఒంటిపూట బడులు..

### ఈ నెల 15 నుంచి కొత్త వేళలు

- వేసవి తాపం దృష్ట్యా తెలంగాణలో ఒంటిపూట బడుల నిర్వహణ
- ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు మారిన పనివేళలు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు
- పదో తరగతి ప్రత్యేక క్లాసులు యథాతథంగా కొనసాగింపు
- అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తించనున్న నిబంధనలు

2లో



2లో

## గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

- ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రానికి కేటీఆర్ లేఖ
- హోటళ్లు, హాస్టళ్లు మూతపడే ప్రమాదమని హెచ్చరిక
- చిన్న వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



# పన్ను ఎగవేతదారులు తప్పించుకోవడానికి వీల్లేదు

- పన్ను ఎగవేతలను అరికట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇతర రాష్ట్రాల్లో ఉంటూ ఏపీలో పనిచేసే కాంట్రాక్టర్లపై ప్రత్యేక దృష్టి
- పన్ను ఎగవేతదారులను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి అందే లబ్ధిని వివరిస్తూ సంక్షేమ లేఖ ఇవ్వాలని ఆదేశం
- పథకాల అమలులో పూర్తి పారదర్శకత తీసుకురావడమే లక్ష్యమని వెల్లడి

రాష్ట్రంలో పన్ను ఎగవేతలను నిరోధించేందుకు పటిష్ఠమైన కార్యాచరణ చేపట్టాలని, ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో కొనసాగుతున్న ఆరో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా ఆయన ఆదాయార్జన శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పన్ను ఎగవేతలపై కఠినంగా వ్యవహరించాలని, అయితే పన్ను చెల్లింపుదారులను అనవసరంగా వేధించవద్దని స్పష్టం చేశారు. కొందరు కాంట్రాక్టర్లు తమ కార్యాలయాలను పొరుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకొని, ఆంధ్రప్రదేశ్‌లో పనులు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ రహదారులు,

మిగతా 2లో

# 1.15 కోట్ల కుటుంబాలకు బీమా

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- టిమ్స్, నిమ్స్ ఆసుపత్రుల్లో 10 వేల బెడ్లు
- వైద్య విధానంలో కొత్త పాలసీ తెస్తాం
- విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తాం
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మెడికవర్ ఆస్పత్రి ప్రారంభం



మణికొండ: రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా కల్పించి, ఆరోగ్య భద్రత అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. గురువారం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని మెడికవర్ 25వ ఆసుపత్రిని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. 'విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రభుత్వం ఫోకస్ చేస్తోంది. సంపూర్ణమైన విద్య అందిస్తే 90 శాతం సమస్యలు పరిష్కారమవుతాయి. సంక్షేమ పథకాల అవసరం ఉండదు. 2006లో రాజీవ్ ఆరోగ్య శ్రీ వచ్చింది. 20 ఏళ్లలో కోట్లాది మందికి వైద్య సేవలందించాం. ఈ డేటాను ఎనాలసిస్ చేస్తాం. ఏ ప్రాంతంలో ఎలాంటి రోగాలు వస్తున్నాయి. ఎందుకు వస్తున్నాయనేది స్పష్టమవుతుంది. దీనికి తగ్గట్లు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. 4 కోట్ల మంది ఆరోగ్య సమస్యలను అర్థం చేసుకోవడానికి డేటాబేస్ డిజిటల్ కార్డును సిద్ధం చేస్తాం. పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో ప్రారంభించాం. మెడికల్, ఫార్మా, డ్రగ్స్ హబ్‌గా హైదరాబాద్ మారింది'అని చెప్పారు. 'రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 21 లక్షల మంది విద్యార్థులున్నారు. కేవలం పాఠశాలకు వెళ్లి

మిగతా 2లో



# యుద్ధ కల్లోలం

### దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లుతున్న పశ్చిమాసియా

- 100 డాలర్లు దాటిన బ్యారెల్ ముడి చమురు ధర
- దాడులు ఆపకపోతే 200 డాలర్లు దాటడం తథ్యం
- గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలను మూసివేయాలి
- డిమాండ్ చేసిన ఇరాన్ సైన్యం
- మా బిడ్డల మరణానికి ప్రతీకారం తీర్చుకుంటాం
- అమెరికా, ఇజ్రాయెల్‌లను వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- హోర్ముజ్‌ను తెరిచే ఆలోచన లేదు
- ఇరాన్ నూతన సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ స్పష్టీకరణ
- 3 షరతులకు అంగీకరిస్తే యుద్ధం ఆగిపోతుందన్న ఇరాన్

2లో

## దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్...

- జువ్వలదిన్నెలో శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్
- నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో అటానమస్ షిప్ యార్డ్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- సాగర్ డిఫెన్స్ సంస్థ తొలి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి
- వెయ్యి మందికి పైగా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు
- ఏపీని మారిటైం రోబోటిక్స్ హబ్‌గా మార్చడమే లక్ష్యం
- 2026 నవంబర్ నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం

2లో




# వైఎస్సార్‌సీపీ.. 'కోట్లాది మంది అభిమానులది



- వైఎస్సార్‌సీపీ 16వ ఆవిర్భావ దినోత్సవంలో వైఎస్ జగన్
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు
- వైఎస్సార్‌ను గుండెల్లో పెట్టుకున్న ప్రతి ఒక్కరిదీ వైఎస్సార్‌సీపీ
- దేశ రాజకీయాల్లో ప్రబలమైన పార్టీ.. పెను మార్పులకు నాంది
- జగన్ ఏనాడూ భయపడలేదు... వెనక్కి తగ్గలేదు
- విలువలు, విశ్వసనీయతకు మారుపేరు

అమరావతి: విలువలతో కూడిన రాజకీయాలు మర్చిపోయి ఉన్న పరిస్థితుల మధ్య.. విలువలు, విశ్వసనీయత అనే పదాలకు అర్థం చెబుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పుట్టుక, ఆ తర్వాత ఎదుగుదల కొనసాగిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ

# గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి: కేటీఆర్

గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా గుర్తించాలని విజ్ఞప్తి

దేశంలో వాణిజ్య, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడిందని, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి ఒక లేఖ రాశారు. ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కారణంగా హోటళ్లు, తినుబండారాలు, పీజీ హాస్టళ్లు, చిన్న ఆహార వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని కేటీఆర్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. సరఫరాను వెంటనే పునరుద్ధరించకపోతే, వేలాది సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, వాటిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేటీఆర్ కేంద్రానికి కొన్ని కీలక సూచనలు చేశారు. చిన్న వ్యాపారులకు ప్రాధాన్యతనిచ్చేలా ఎల్పీజీ కేటాయింపుల విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. జిల్లాల వారీగా సిలిండర్ల లభ్యతపై పారదర్శక సమాచారం కోసం రియల్-టైమ్ పబ్లిక్ డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షోభ సమయంలో చిన్న వ్యాపారులపై అదనపు భారం పడకుండా వాణిజ్య సిలిండర్ల ధరల పెరుగుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించి, అధిక ధరలకు విక్రయించే బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లోని పీజీ హాస్టళ్లను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, అంతరాయం లేని సరఫరాను అందించాలని కోరారు. అలాగే, గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా వర్గీకరించి, వాటి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చూడాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇది లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య అని, వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## 1.15 కోట్ల కుటుంబాలకు బీమా

చదువుకునే విధానం తల్లిదండ్రులకు సంతృప్తినివ్వడం లేదు. 3వ తరగతి చదువుతున్న విద్యార్థి 2వ తరగతి పాఠ్యపుస్తకాన్ని కేవలం 6.5 శాతం మంది మాత్రమే చదవగలుగుతున్నట్లు మా సర్వేలో తేలింది. విద్యతోపాటు స్కిల్ అవసరం. స్కిల్ లేకుంటే ప్రపంచంతో పోటీపడలేం. నర్సరీ నుంచి 12 వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అనే కొత్త కాన్సెప్ట్ తెస్తున్నాం. ఎడ్యుకేషనల్ రిఫార-మ్స్ తీసుకురావడమే కాకుండా ఇప్పటివరకు ఉన్న ఇంటర్మీడియెట్ విధానాన్ని వచ్చే ఏడాది నుంచి రద్దు చేస్తాం. నర్సరీ నుంచి 12 వరకు స్కూల్ ఎడ్యుకేషన్ కిందకు తెస్తాం. వివిధ పాఠశాలలను ఒక దగ్గరకు తెస్తాం. ప్రైవేటు స్కూల్స్ సక్సెస్ స్టోరీ.. రవాణానే. ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది. ఉచితంగా, లేదా 50 శాతం రాయితీతో ప్రభుత్వమే విద్యార్థులను పాఠశాలకు తరలిస్తుంది. మేము ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)గా మార్చాం. సీఎస్ఆర్ కింద పదేళ్ల పాటు టాటాసన్స్ సంస్థ వీటిని నిర్వహిస్తుంది. రూ.2,400 కోట్ల బడ్జెట్‌లో 2,100 కోట్లు టాటాసన్స్ భరిస్తుంది. భవిష్యత్తులో పాలిటెక్నిక్ కళాశాలలనూ ఈ కోవలోకి తెస్తాం. ప్లేట్‌లో ఆహారం వడ్డిస్తే అది ఎన్ని కేలరీలు ఉంటుందో తెలిపే యాప్ ఉంది. దాన్ని వాడుకుంటాం'అని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'వైట్ కాలర్ జాబ్‌లో వచ్చే గ్యాప్‌ను భర్తీ చేయడానికి బ్లూ కలర్ జాబ్‌కు ప్రిపేర్ కావాలి. దీన్ని ఏఐ రీప్లేస్ చేయలేదు. మొదటి దశలో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తీసుకున్నాం. రెండో దశలో సేవారంగం తీసుకున్నాం. ఇప్పుడు తయారీ రంగంపై దృష్టిసారిస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి హెల్త్ టూరిజంలో తెలంగాణకు 810 లక్షల మంది, ఇతర దేశాల నుంచి 2.10 లక్షల మంది వచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. కొన్ని నెలల్లో రూ.1,800 కోట్లు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఖర్చు చేశాం.

## వైఎస్సార్‌సీపీ.. 'కోట్లాది మంది అభిమానులది

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తు చేశారు. "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనేది ఒక్క జగన్‌ది మాత్రమే కాదు.. కొన్ని కోట్ల మంది వైఎస్సార్‌సీపీ సాక్షి, కార్యకర్తలు, అభిమానులది.. వైఎస్సార్‌ను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్న నా కుటుంబ సభ్యులది అని నేను గర్వంగా చెబుతున్నా.." అని స్పష్టం చేశారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున కార్యకర్తలు, అభిమానులు, నాయకులు తరలిరావడంతో పార్టీ కేంద్ర కార్యాలయం జనసంద్రంగా మారింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలు సమర్పించి నివాళులర్పించిన అనంతరం వైఎస్ జగన్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున తరలి వచ్చిన పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులనుద్దేశించి మన పార్టీ ఆవిర్భవించి ఈరోజుకు 15 ఏళ్లు పూర్తయింది. 2011 మార్చి 12న పుట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దేశంలోనే ఒక మార్క్‌గా నిల్చింది. రాష్ట్రంలోనే కాదు, దేశ రాజకీయాల్లోనే ప్రబలంగా మన పార్టీ కనిపిస్తోంది. 15 సంవత్సరాల క్రితం పార్టీ ఎలాంటి పరిస్థితుల్లో పుట్టింది అనేది ఒకసారి జ్ఞాపకం చేసుకుంటే.. ఆరోజు నల్లకాలువలో ఇచ్చిన ఒక మాట, మన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపన, ఎదుగుదలకు కారణమైంది. ఆ ఒక్క మాట నా కుటుంబ పరిస్థితుల్ని మార్చింది. రాష్ట్రం దశ, దిశ మార్చింది. ఆ ఒక్క మాట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంకురార్పణకు శ్రీకారం చుట్టింది. ఆరోజు జగన్ అనే వాడు ఒకే ఒక్కడు... కానీ జగన్ ఏనాడూ భయపడలేదు. ఆరోజు కాంగ్రెస్ పార్టీ ఇక్కడ, దేశంలోనూ అధికారంలో ఉంది. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కలిసి కుట్రలు, కుతంత్రాలు పన్నిన పరిస్థితి చూశాం. కానీ, జగన్ ఏనాడూ భయపడలేదు. కారణం జగన్‌కు నమ్మకం ఉన్నది పైన ఉన్న దేవుడు, కింద ఉన్న మీమీద మాత్రమే అని గర్వంగా చెబుతా. నేను నమ్ముకున్న నా ప్రజలు, నేను నమ్ముకున్న నా దేవుడు.. ఇద్దరూ తోడుగా ఉండి నన్ను నడిపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విలువలు, విశ్వసనీయతకు ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని, నాతో పాటు నడిచే ప్రతి కుటుంబ సభ్యుడు కూడా కాలర్ ఎగరేసుకుని.. అదిగో అతడే మా నాయకుడు, అదిగో అదే మా పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని గర్వంగా చెప్పుకునేలా పార్టీ అడుగులు వేస్తుందని మరొక్కసారి మీ అందరికీ వినమ్రంగా, వినయపూర్వకంగా చెబుతున్నా. మీ అందరి ప్రేమాభిమానాలకు మరొక్కసారి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా. వైఎస్సార్‌ను అభిమానించే ప్రతి గుండెకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త, ప్రతి

# యుద్ధ కల్లోలం



దుబాయ్/టెహ్రాన్: పశ్చిమాసియాలో ఎడతెరిపిలేని యుద్ధం ధాటికి చమురు మంట మండుతోంది. విదేశీ చమురు రవాణా నౌకలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఇరాన్ సైన్యం క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఫలితంగా బ్యారెల్ ముడి చమురు ధర గురువారం 100 డాలర్లు దాటేసింది. యుద్ధం మొదలైన తర్వాత ఏకంగా 38 శాతం పెరిగింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను మూసివేసి, దాడులు ఆపకపోతే బ్యారెల్ ధర 200 డాలర్లకు చేరడం తథ్యమని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. దయుద్ధం మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తుండడం, చమురు మంటలు మరింత పెరగడమే తప్ప ఇప్పట్లో చల్లారే సంకేతాలు లేకపోవడం ప్రపంచ దేశాల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. కీలకమైన చమురు రవాణా మార్గమైన హార్మూజ్‌ను దిగ్బంధించడం ద్వారా ప్రపంచదేశాలపై.. ముఖ్యంగా అమెరికాపై ఆర్థికంగా ఒత్తిడి పెంచడమే ఇరాన్ వ్యూహంగా కనిపిస్తోంది. అమెరికా వైమానిక దాడుల్లో వందలాది మంది చిన్నారులు సహా సాధారణ ప్రజలు బలైపోవడం పట్ల ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తీవ్రంగా స్పందించారు. తమ బిడ్డల మరణాలకు ప్రతీకారం తీర్చుకోక తప్పదని తేల్చిచెప్పారు. శత్రుదేశాలైన అమెరికా, ఇజ్రాయెల్‌లను విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత యుద్ధంపై ఆయన స్పందించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. మరోవైపు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అమెరికా ఇజ్రాయెల్‌లకు కొత్త ఆఫర్ ఇచ్చారు. మూడు షరతులకు అంగీకరిస్తే తాము దాడులు ఆపేస్తామని చెప్పారు. ముడి చమురు నౌక షెన్‌లాంగ్ సూయిజ్‌మ్యాక్స్ హార్మూజ్ నుంచి సాహసోపేతంగా ముంబైకి చేరుకుంది. ఇరాన్ అమర్చిన సముద్ర మందుపాతరలైన 'సీమైన్స్'కు చిక్కకుండా క్షేమంగా గమ్యస్థానానికి చేరుకోవడం సంచలనాత్మకంగా మారింది. యుద్ధం వల్ల చమురు ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో ప్రపంచదేశాలు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాయి. చమురు వినియోగంపై పరిమితులు విధిస్తున్నాయి. బుధవారం రాత్రి ఇరాక్‌లో ఉమ్ ఖాసర్ నగరంలోని ఖోర్ అల్ జుబేర్ నౌకాశ్రయంలో మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉన్న అమెరికా ముడిచమురు రవాణా నౌక 'సేఫ్‌సీ విష్ణు'పై ఇరాన్ దాడిచేసింది. ఈ ఘటనలో ఒక భారతీయుడు మరణించాడు. అమెరికా చమురు నౌకలను టార్గెట్ చేశామని, బ్యారెల్ ముడి చమురు ధర త్వరలో 200 డాలర్లకు చేరబోతోందని ఇరాన్ మిలటరీ కమాండ్ ప్రధాన కార్యాలయం అధికార ప్రతినిధి ఇబ్రహీం జొల్ఫాఖారీ స్పష్టంచేశారు. ఇరాన్ యుద్ధం గురువారం పదమూడో రోజుకు చేరుకుంది. దాడులు ప్రతిదాడులు యథాతథంగా కొనసాగుతూనే ఉన్నాయి. గల్ఫ్ దేశాలే లక్ష్యంగా ఇరాన్ సైన్యం బాంబుల మోత మోగించింది. దుబాయ్ తీరంలో కంటైనర్ నౌకపై దాడికి దిగింది. నౌక మంటల్లో చిక్కుకోగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బహ్రెయిన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉన్న ముహరాఖ్ ద్వీపాన్ని సైతం ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. క్షిపణి దాడుల్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సౌదీ అరేబియాలోని అతిపెద్ద షెబా చమురు క్షేత్రంపై డ్రోన్‌ను ప్రయోగించింది. రాజధాని రియాద్‌లో దౌత్యవేత్తల భవనంపై ఇరాన్ ప్రయోగించిన డ్రోన్‌ను మధ్యలోనే ధ్వంసం చేశామని సౌదీ అరేబియా ప్రకటించింది.

# పన్ను ఎగవేతదారులు తప్పించుకోవడానికి వీల్లేదు

(మొదటి పేజీ తరువాయి)

రైల్వేలు, ఇతర ప్రాజెక్టుల పనులు చేస్తున్నప్పటికీ, వారి నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నులు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. టెండర్లు, వర్క్ ఆర్డర్లలో ఉన్న కాంట్రాక్టర్ల నుంచి ఆదాయం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల కాంట్రాక్టర్లు చెల్లించే పన్నులు మన రాష్ట్ర ఖజానాకే చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గట్టిగా చెప్పారు. "పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధి నమోదైతేనే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తుంది. ప్రతి రంగంలోనూ వృద్ధి సాధించడం ద్వారా నిర్దేశిత జీఎస్‌డీపీ లక్ష్యాన్ని చేరుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. పన్ను ఎగవేతలకు పాల్పడి ఎవరూ తప్పించుకోవడానికి వీల్లేదని, చట్ట ప్రకారం ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పన్ను వసూళ్ల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తూనే, నిజాయితీపరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. సూపర్ సిక్స్ సహా ఇతర సంక్షేమ పథకాల అమలులో పూర్తిస్థాయి పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రయోజనాలను వివరిస్తూ 'సంక్షేమ లేఖ' అందజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "ప్రతి నెలా ఏ కుటుంబానికి పెన్షన్, ఉచిత సిలెండర్, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందో స్పష్టంగా తెలియజేస్తూ లేఖ ఇవ్వాలి. దీనివల్ల ప్రభుత్వ పనితీరులో పారదర్శకతతో పాటు, లబ్ధిదారుల్లో పథకాలపై యాజమాన్య భావన పెరుగుతుంది" అని అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి త్వరలోనే ఒక క్యాలెండర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. "పెట్టుబడుల గురించి ఎలా ఆలోచిస్తున్నామో, అదే స్థాయిలో పేదల సంక్షేమం, వారి సాధికారత గురించి కూడా కలెక్టర్లు ఆలోచించాలి. సంపద సృష్టితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## తెలంగాణలో ఒంటిపూట బడులు..

తెలంగాణలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసింది. ఈ నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒంటిపూట బడులు (హాఫ్‌డే స్కూల్స్) నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూట విధానంలోనే నడుస్తాయి. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయి. తరగతులు ముగిసిన వెంటనే మధ్యాహ్నం 12:30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. అయితే, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే, పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. మిగతా రోజుల్లో ఈ కేంద్రాలు కూడా సాధారణ హాఫ్‌డే టైమింగ్స్‌ను పాటిస్తాయి.

## దుబాయ్, సౌదీ, ఖతార్‌లపై ఇరాన్ దాడులు.. ఇప్పటివరకు 24 మంది మృతి

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తుంటే ఇరాన్ మాత్రం గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. దుబాయ్, సౌదీ, ఖతార్ సహా యూఏఈ దేశాలపై దుబాయ్ దాడులు చేస్తోంది. ముఖ్యంగా అక్కడి అమెరికన్ ఆర్మీ బేస్‌లపై ఇరాన్ దాడులకు దిగుతోంది. తాజాగా గురువారం కూడా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులు చేసింది. దుబాయ్‌లోని డౌన్ టౌన్ సిటీపై డ్రోన్ దాడి జరిగినట్లు, దీనివల్ల స్వల్పంగా నష్టం కలిగినట్లు దుబాయ్ అధికారులు తెలిపారు. అయితే, ఈ దాడి ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని కలగలేదని, స్వల్ప గాయాలు తగిలాయని తెలిపింది. మిడిల్ ఈస్ట్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభమైన సంగతి తెలిసిందే.

# దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్...

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, రక్షణ రంగాల్లో మరో కీలక ముందడుగు పడింది. దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాలను గణనీయంగా పెంచే దిశగా నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద దేశంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. శంకుస్థాపన కార్యక్రమానికి జువ్వలదిన్నె చేరుకున్న మంత్రి లోకేశ్ కు సాగర్ డిఫెన్స్ సంస్థ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించి, ప్రాజెక్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కూటమి ప్రభుత్వం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో 29.58 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఇందులో 7.58 ఎకరాల వాటర్ ఫ్రంట్ ల్యాండ్ కూడా ఉండటం విశేషం. మొదటి దశలో సాగర్ డిఫెన్స్ సంస్థ రూ.45 కోట్ల పెట్టుబడి పెట్టనుండగా, దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మందికి పైగా యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్



ఇంజనీరింగ్, పరిశోధన-అభివృద్ధి వంటి కీలక రంగాల్లో ఉపాధి లభిస్తుంది. 2026 నవంబర్ నాటికి ఈ కేంద్రంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టును మొత్తం 200 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో బ్లూ ఎకానమీ, మారిటైం ఆవిష్కరణలు బలోపేతం కావడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌ను మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా నిలబెట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

అంతకుముందు, జిల్లాకు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్ కు బోగోలు మండలం కప్పరాలతిప్ప వద్ద నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతి రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పి.సునీల్ కుమార్, ఎన్.విజయశ్రీ, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు, సాగర్ డిఫెన్స్ సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## ఒత్తిడి వీడి పరీక్షలు రాయాలి

**- మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్**

**వలిగొండ, మార్చి 12 (తొలివెలుగు న్యూస్) :** విద్యార్థులు భయాందోళనలకు లోనుకాకుండా ధైర్యంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయాలని మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ సూచించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల కోసం పది రోజుల క్రితం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం వలిగొండ మండల కేంద్రంలో బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని, జిల్లాలో వలిగొండ మండలం మొదటి స్థానంలో నిలిచేలా విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భువనగిరి సాయికుమార్, నాయకులు ఉదయ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**- వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్**




**వలిగొండ, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** యువత డ్రగ్స్, బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్ సూచించారు. వలిగొండ మండల కేంద్రంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ల 95వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గోడపత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ యుగేందర్ గౌడ్ మాట్లాడుతూ.. యువత ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు అలవాటు పడకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా కొంతమంది యువకులు క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటూ కుటుంబాలకు విషాదం మిగిల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాటికి దూరంగా ఉండి తమ విలువైన జీవితాన్ని కాపాడుకోవాలని యువతకు సూచించారు. అలాగే మహనీయుల ఆలోచనా విధానాన్ని ఆదర్శంగా తీసుకుని యువత సమాజ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్, నాయకులు మారోజు నరసింహాచారి, గుండెగాని నాగరాజ్, సలిగంజి కృష్ణ కుమార్, మెట్టు లక్ష్మణ్ నారాయణ, నరేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లి స్టేజి వద్ద బస్సులు ఆపాలి

**- యాదగిరిగుట్ట డిపో ముందు సిపిఐ ధర్నా.. డీఎంకు వినతి**

**యాదగిరిగుట్ట, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట మండలం గుండ్లపల్లి స్టేజి వద్ద భువనగిరి నుంచి వెళ్లే ప్రతి ఆర్టీసీ బస్సును ఆపాలని డిమాండ్ చేస్తూ గురువారం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సిపిఐ నాయకులు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ మాట్లాడుతూ గుండ్లపల్లి స్టేజి వద్ద బస్సులు ఆపకపోవడంతో అక్కడి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు బస్టాండ్ వరకు నడిచి వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని భువనగిరి నుంచి వచ్చే ప్రతి బస్సును గుండ్లపల్లి స్టేజి వద్ద ఆపేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరబోయిన మహేందర్, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, ఎనిమిదో వార్డు శాఖ కార్యదర్శి ముకేర్ల పెంటయ్య, రామచందర్, వెంకటేష్ యాదవ్, కోపగాని రాజు తదితరులు పాల్గొన్నారు.




# యాదాద్రిలో గవర్నర్ దంపతుల పూజలు







**- ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం..**

**- శివపార్వతులకు ప్రత్యేక అభిషేకాలు**

**యాదగిరిగుట్ట, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల గురువారం కుటుంబ సభ్యులతో కలిసి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదాద్రికి చేరుకున్న గవర్నర్‌కు ముందుగా పోలీసుల గౌరవ వందనం నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన ఆయనకు వేద పండితులు, అర్చకులు ఆలయ సంప్రదాయాల ప్రకారం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద బలిపీఠానికి నమస్కరించిన గవర్నర్, అనంతరం స్వామివారి అంతరాలయంలో అర్చనాది పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవారి అష్టోత్తరంతో ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తరువాత వేద పండితులు చతుర్వేద శ్లోకాలతో గవర్నర్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి భవాని శంకర్ గవర్నర్‌కు స్వామి అమ్మవారి చిత్రపటాన్ని మెమొంటోగా అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామివారి ప్రసాదాన్ని గవర్నర్‌కు అందించారు. అనంతరం అనుబంధ దేవాలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో గవర్నర్ దంపతులు స్ఫటిక లింగానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. యాదగిరిగుట్టకు వచ్చిన గవర్నర్‌కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం!

- జిల్లాలో 330 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు.
- రబి సీజన్‌లో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం
- కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.
- సివిల్ సప్లై అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి సమీక్షా సమావేశం.



**యాదాద్రి భువనగిరి, మార్చి 12 (తొలివెలుగు న్యూస్) :** జిల్లాలో రబి సీజన్‌లో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మినీ మీటింగ్ హాల్‌లో సివిల్ సప్లై మేనేజర్, సివిల్ సప్లై అధికారులు, వ్యవసాయ, కో-ఆపరేటివ్, మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు నాలుగు లక్షల యాభై వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలో 330 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, ప్యాడి క్లీనర్, తూకం పరికరాలు వంటి అన్ని సదుపాయాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. గన్నీ బ్యాగుల కొరత లేదా రవాణా సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లులకు ధాన్యం తరలించిన వెంటనే దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, టెంట్లు, కుండల్లో చల్లటి మంచినీరు, నీడ ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం వివరాలను ట్రక్ షీట్‌లో నమోదు చేసి రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించిన సిఎంఆర్ బియ్యం డెలివరీని పూర్తి చేయాలని పౌరసరఫరాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై డీఎం హరికృష్ణ, సివిల్ సప్లై అధికారి రోజారాణి, వ్యవసాయ అధికారి రమణారెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి సాయికృష్ణ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# విద్యా దాతకు కన్నీటి వీడ్కోలు!

**- సరస్వతమ్మ మృతి పట్ల రఘునాథపురం పాఠశాలలో సంతాప సభ**

**రాజపేట, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలం రఘునాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి భూమి, నగదు విరాళం అందించిన దాత కీర్తిశేషులు సంగిశెట్టి శెంబయ్య సతీమణి సంగిశెట్టి సరస్వతమ్మ మృతి పట్ల గురువారం పాఠశాలలో సంతాపం ప్రకటించారు. 1990 సంవత్సరంలో పాఠశాల నిర్మాణం కోసం ఆమె రెండున్నర ఎకరాల భూమితో పాటు రూ.1,20,000 నగదును విరాళంగా అందజేసి విద్యాభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయులు కె. మనోజ్ కుమార్ ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్య గౌడ్, బింగి రమేష్, సామల భాస్కర్, బూరెల శ్రీనివాస్ గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.





## ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ

- బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానుకల అందజేత

**రాజపేట, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాజాపేట మండల కేంద్రం, చల్లూరు గ్రామంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా (కానుకలు) పంపిణీ చేశారు. గురువారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల అనిత బీర్ల ఫౌండేషన్ చైర్మన్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలను అందజేసి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో సామరస్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మహేందర్ గౌడ్, రాజాపేట ఉపసర్పంచ్ కేదార్ గౌడ్, టౌన్ అధ్యక్షుడు ఐరన్ నవీన్ కుమార్, డాక్టర్ చింతల రవి, గొల్ల నర్స్వామి, చల్లూరు సర్పంచ్ రూప బాల్ నర్సయ్య, ఉపసర్పంచ్ బొంత సుధాకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు నవీన్, వార్డ్ సభ్యులు, నాయకులు ఇంజనరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**- తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి: దానధర్మ చారిటబుల్ ట్రస్ట్**

**రాజపేట, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజపేట మండలంలోని పలు గ్రామాల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. గురువారం నెమిల, పారుపల్లి, బొందుగుల, కుర్రారం, సింగారం గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ సంస్కారవంతమైన జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో పుట్ట వీరయ్య, షాపురం శ్రీశైలం, ముత్యం రాజు, బర్మ శ్రీశైలం, బుడిగా కరుణాకర్, గౌర మధు, మార్గ శివకుమార్, ఇంద్రపాల రవి, మాయకోటి రాజు, పిడిశెట్టి కనకయ్య, బూరుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిలో జిల్లాను ముందుంచాలి





- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు అవగాహన శిక్షణ
- గ్రామాలు, వార్డుల్లో అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి
- మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యచరణ కార్యక్రమం
- భువనగిరిలో నూతన సర్పంచులు, కౌన్సిలర్లు, చైర్‌పర్సన్‌లకు శిక్షణ
- అభివృద్ధి పనులతో గ్రామాలు, పట్టణాలు ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ చేరాలి
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**యాదాద్రి భువనగిరి, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామాలు, వార్డుల్లో సంక్షేమ ఫలాలు అందించే బాధ్యత సర్పంచులు, వార్డు మెంబర్లు, చైర్‌పర్సన్‌లపై ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని వి-కన్వెన్షన్, న్యూ వివేరాలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, సర్పంచులు, చైర్‌పర్సన్‌లకు ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు రాష్ట్ర గేయం వందేమాతరం ఆలపించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవారికి అందేలా చూడాలని కోరారు. గత రెండు సంవత్సరాల్లో రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. రాబోయే ఎండకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలు, పట్టణాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు 99 రోజుల కార్యచరణ ప్రణాళికపై పూర్తి అవగాహన కలిగి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రజలు మెచ్చేలా గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో సాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత పాటిస్తే గ్రామాలు అందంగా తీర్చిదిద్దబడతాయని అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలపై దృష్టి సారించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సెర్ప్ సీఈవో, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. ప్రతి మండలంలో ప్రజాపాలన ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాలు, పట్టణాలను అభివృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రమాద నివారణ, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ డ్రైవింగ్, హెల్మెట్ వినియోగం, నో డ్రగ్స్ వంటి అంశాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు 99 రోజుల కార్యచరణ ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లాలోని వివిధ మండలాల చైర్మన్లు, సర్పంచులు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.






## అక్రమ ఇసుక ట్రాక్టరు పట్టివేత

**- రఘునాథపూర్ వాగులో ట్రాక్టరు సీజ్.. నిందితుడిపై కేసు**

**రాజపేట, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** రాజపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పల్లెపాటి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో రఘునాథ్‌పూర్ గ్రామం సమీపంలోని వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఆయన గ్రామ పంచాయతీ అధికారి గణేష్‌తో కలిసి అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ 30 టీఏ 4075 నంబరు గల స్వరాజ్ ట్రాక్టర్, టీఎస్ 30 టీఏ 4089 నంబరు గల ట్రాలీలో ఇసుకను లోడ్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. అధికారులు ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్‌ను ఇసుక రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలు చూపించాలని కోరగా, అతను ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు చూపించలేకపోయాడు. విచారణలో డ్రైవర్ తన పేరు జంగిలి ప్రవీణ్ (25)గా, యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందినవాడిగా వెల్లడించాడు. అతను అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌తో కలిసి రాజపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చిరుమర్తి లింగయ్య

- రామన్నపేట, తుమ్మలగూడెంలో వివాహ వేడుకలకు హాజరు





**రామన్నపేట, మార్చి 12 (తొలివెలుగు న్యూస్) :** నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గురువారం రామన్నపేట మండలంలో పర్యటించారు. పట్టణ కేంద్రానికి చెందిన గంగాపురం యాదయ్య గౌడ్ కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం తుమ్మలగూడెం (ఇంద్రపాలనగరం) గ్రామంలో వరికుప్పల రమేష్ కుమార్తె వివాహానికి హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, జిల్లా నాయకుడు కన్నెబోయిన బలరాం, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి అమీర్, ఉప సర్పంచ్ చొప్పరి నరసింహ, వార్డు సభ్యుడు వరికుప్పల స్వామి, నాయకులు జాల అమరేందర్ రెడ్డి, బొలుగుల కృష్ణ, చెరుకు ఉపేందర్, అంతటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## అరేగూడెం సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి గ్రామ ప్రతినిధుల వినతి
- గ్రామ సర్పంచ్ ఏన్నపల్లి ధనలక్ష్మీ వెంకట్ రెడ్డి

**చౌటుప్పల్, మార్చి 12 (తొలివెలుగు న్యూస్) :** గ్రామంలోని మౌలిక వసతుల కల్పన, పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ అరేగూడెం గ్రామ ప్రతినిధులు గురువారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సర్పంచ్ ఏన్నపల్లి ధనలక్ష్మి వెంకట్ రెడ్డి నేతృత్వంలో ప్రతినిధుల బృందం గ్రామంలోని స్థితిగతులను ఎమ్మెల్యేకు వివరించింది. ముఖ్యంగా అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణానికి, మురుగు కాలువల విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





## పాలనపై అవగాహన.. అభివృద్ధికి బాట!

- భువనగిరిలో కౌన్సిలర్ల శిక్షణ శిబిరం.. - చౌటుప్పల్ ప్రజాప్రతినిధుల హాజరు

**యాదాద్రి భువనగిరి/ చౌటుప్పల్, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** మున్సిపల్ పాలనలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పట్టు సాధించాలని, అప్పుడే క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. గురువారం భువనగిరి పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిలర్ల ప్రత్యేక శిక్షణ శిబిరానికి చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన 20 వార్డుల కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మున్సిపల్ చట్టాలు, నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్లు వారధిగా నిలవాలని, పట్టణ పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ప్రభుత్వం నుంచి మంజూరయ్యే సాధారణ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులను ఎలా వినియోగించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణలో పాల్గొన్న చౌటుప్పల్ 20 వార్డుల కౌన్సిలర్లు మాట్లాడుతూ.. వార్డులలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు, నిబంధనలపై స్పష్టత వచ్చేందుకు ఈ శిబిరం ఎంతో దోహదపడిందన్నారు. పారదర్శక పాలన ద్వారా చౌటుప్పల్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సమావేశం

**- నూతన పాలకవర్గ ఏర్పాటుపై చర్చ**

**చౌటుప్పల్, మార్చి 12 (తొలివెలుగు న్యూస్) :** పట్టణంలోని శ్రీ పెరుమాళ్ల ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఈ భేటీ జరగనుంది. ప్రధానంగా దేవాలయానికి నూతన పాలకవర్గాన్ని ఎంపిక చేయడంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఆలయ అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపై కూడా నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ సమావేశానికి ప్రస్తుత సభ్యులతో పాటు మాజీ సభ్యులు, గ్రామ పెద్దలు హాజరుకావాలని కమిటీ అధ్యక్షుడు ఉప్పు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీనివాస చారి కోరారు.

## అన్నదాతల కళ్లలో ఆనందం.. సాగునీటి కష్టాలకు చెక్!

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవతో లిఫ్ట్ పనులకు శ్రీకారం
- లక్కారం రైతులకు వరప్రదాయిగా మారనున్న లోద్ది కుంట, గంగదేవి కుంటలు
- 8వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బద్రి గాలయ్య
- వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి

**చౌటుప్పల్, మార్చి 12 (తొలివెలుగు న్యూస్) :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు లక్కారం గ్రామంలో సాగునీటి సమస్యకు పరిష్కారం దొరకనుంది. గ్రామంలోని లోద్ది కుంట, గంగదేవి కుంటలను నీటితో నింపే లిఫ్ట్ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. పిల్లాయిపల్లి కాలువ నుంచి పైపులైన్ వేసి లిఫ్ట్ ద్వారా ఈ కుంటలను నింపే పనులను కాలువ కమిటీ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారని తెలిపారు. దివిస్ పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి సీఎస్ఆర్ నిధుల కింద రూ.1.06 కోట్లు మంజూరు చేయించారని చెప్పారు. ఈ పనులు పూర్తయితే బీడు భూములు సాగులోకి వచ్చి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. లిఫ్ట్ ద్వారా కుంటలు నిండితే పరిసర ప్రాంతాల్లోని రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దివిస్ పరిశ్రమ సీఎస్ఆర్ విభాగం ప్రతినిధి గోపి, 8వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బద్రి గాలయ్య, మాజీ ఎంపీటీసీ కాసార్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, గ్రామ పెద్దలు దుబ్బాక శ్రీనివాస్ రెడ్డి, గుండెబోయిన నర్సింహా యాదవ్, సూరకంటి మధుసూదన్ రెడ్డి, ఆకుల తిరుమల్ రెడ్డి, మునుకుంట్ల మల్లేశం గౌడ్, రాసాల ఐలయ్య, మునుకుంట్ల యాదయ్య గౌడ్, గంటిల యాదయ్య, తోటకూర రాములు యాదవ్, గోపనబోయిన పెద్ద పెంటయ్య, తోటకూర జంగయ్య, సూరకంటి రాఘవ రెడ్డి, పాశం రాజేష్, ఆకుల యాదిరెడ్డి, రాసాల రవి తదితరులు పాల్గొన్నారు.





## వోల్టేజ్ సమస్యను పరిష్కరించి.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

- విద్యుత్ శాఖ డీఈకి 8వ వార్డు కౌన్సిలర్ బద్రి గాలయ్య వినతి

**చౌటుప్పల్, మార్చి 12 (తొలివెలుగు న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నూతన కౌన్సిలర్ బద్రి గాలయ్య అధికారులను ఆశ్రయించారు. గురువారం ఆయన చౌటుప్పల్ విద్యుత్ శాఖ డీఈ మల్లికార్జున్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం వార్డులోని సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాలయ్య మాట్లాడుతూ.. కోట మైసమ్మ దేవాలయం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తరచూ వోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని, దీనివల్ల స్థానిక రైతులు సాగునీటి పంపుసెట్లు నడపలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక మోటార్లు కాలిపోతున్నాయని, రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. స్పందించిన డీఈ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ గుండెబోయిన నరసింహ యాదవ్, దేశట్ల లింగస్వామి, బద్రి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు టీజేఏ నాయకుల వినతి



**యాదగిరిగుట్ట, మార్చి 12 (తొలివెలుగు న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షానూర్ బాబా కోరారు. గురువారం యాదగిరిగుట్టలోని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షానూర్ బాబా మాట్లాడుతూ.. జిల్లాలో సొంత ఇల్లు లేక ఎంతోమంది జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందిస్తూ.. జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఏ మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

- జలాల్‌పురంలో ఓవర్ హెడ్ ట్యాంకుల పరిశీలన చేసిన జెడ్పీ సీఈఓ శోభారాణి

**భూదాన్‌పోచంపల్లి, మార్చి 12 (తొలివెలుగు న్యూస్):** వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. మండలంలోని జలాల్‌పురం గ్రామంలో నిర్వహిస్తున్న 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓవర్ హెడ్ తాగునీటి ట్యాంకులను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. పైప్‌లైన్లలో లీకేజీలు ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టి నీటి వృథా జరగకుండా చూడాలని సూచించారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాపాక లింగస్వామి, ఉపసర్పంచ్ కేసారం మధుసూదన్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# క్రూడ్ మంట.. బేర్ పంజా!

**మళ్లీ సెంచరీ దాటిన ముడిచమురు ధర**
**కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు**
**సెన్సెక్స్ 829 పాయింట్లు పతనం**
**నిఫ్టీకి 228 పాయింట్లు నష్టం**




మళ్లీ ముడిచమురు ధరల మంటతోపాటు పశ్చిమాసియాలో యుద్ధ భయాలు పెరగడంతో దేశీ స్టాక్ మార్కెట్లకు వరుసగా రెండో రోజు షాక్ తగిలింది. రోజంతా అమ్మకాలదే పైచేయి కావడంతో మార్కెట్లు నష్టాలలోనే కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 76,000 పాయింట్ల దిగువకు సైతం పడిపోయింది. బ్రెంట్ చమురు పీపా ధర 10 శాతం ఎగసి 100 డాలర్లను దాటింది. ముంబై: చమురు ధరలకు రెక్కలు రావడంతో మరోసారి దేశీ స్టాక్ మార్కెట్లు దెబ్బతిన్నాయి. సెన్సెక్స్ 829 పాయింట్లు పతనమై 76,034 వద్ద ముగిసింది. ఒక దశలో అమ్మకాలు పెరగడంతో 993 పాయింట్లు నీరసించి 76,000 దిగువన 75,871ను తాకింది. ఇక నిఫ్టీ 228 పాయింట్లు క్షీణించి 23,639 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 23,556కు చేరింది. యుద్ధానికి ముగింపు పలకనున్నట్లు యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ ప్రకటించినప్పటికీ దాడులు కొనసాగుతుండటంతో ఇన్వెస్టర్లు ఆందోళనకు లోనవుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. మరోపక్క ముడిచమురు ధరలు సైతం తిరిగి జోరందుకోవడంతో సెంటిమెంటు బలహీనపడినట్లు తెలియజేశారు. ఆసియా, యూరప్ మార్కెట్ల బలహీనతలు సైతం వీటికి జత కలిసినట్లు వెల్లడించారు. బుధవారం సెన్సెక్స్ 1,342 పాయింట్లు, నిఫ్టీ 395 పాయింట్లు కోల్పోయిన విషయం విదితమే.

ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఆటో, ఎఫ్ఎంసీజీ ప్రయివేట్ బ్యాంక్స్, రియల్టీ సూచీలు 32% మధ్య క్షీణించాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఎంఅండ్ఎం, టీఎంపీవీ, ఐషర్, ఎల్అండ్‌టీ, బజాజ్ ఆటో, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, గ్రాసిమ్, టాటా కన్జూమర్, అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్, అపోలో హాస్పిటల్స్, ఇండిగో, ఐటీసీ, యాక్సిస్, ఐసీఐసీఐ 42 శాతం మధ్య డీలాపడ్డాయి. అయితే కోల్ ఇండియా, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, జియో ఫైనాన్స్, టెక్ మహీంద్రా, అదానీ ఎంటర్‌ప్రైజెస్, హిందాల్కో, హెచ్‌సీఎల్ టెక్ 50.5 శాతం మధ్య లాభపడ్డాయి. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.6% చొప్పున నీరసించాయి. ట్రేడైన షేర్లలో 2,645 నష్టపోగా.. 1,598 బలపడ్డాయి. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులకు బీజం పడ్డాక దేశీ స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు ఊపందుకున్నాయి. దీంతో ఫిబ్రవరి 28 మొదలు ఇప్పటివరకూ మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 5,253 పాయింట్లు(6.5 శాతం) క్షీణించింది. అయితే అన్ని రంగాలలోనూ అమ్మకాలు కొనసాగుతుండటంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల విలువ రూ. 23.44 కోట్లమేర హరించుకుపోయింది. వెరసి బీఎస్ఈ మార్కెట్ విలువ) రూ.4,40,06, 434 కోట్ల (4.77 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది.



## 64 ప్రభుత్వ ఆసుపత్రుల్లో డిజిటల్ హెల్త్ కార్డులు

రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థను అమలు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన, అమలుపై రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంగారెడ్డి జిల్లాను పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో ప్రాజెక్టు అమలు విధానం, అవసరమైన సాంకేతిక సదుపాయాలు, ముందస్తు ఏర్పాట్లపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు కింద సంగారెడ్డి జిల్లాలోని మొత్తం 64 ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించారు. ఇందులో జీజీహెచ్1, ఏరియా ఆసుపత్రులు4, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు5, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు4, ప్రైమరీ హెల్త్ సెంటర్లు31, బస్తీ దవాఖానాలు19 ఉన్నాయి. రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ వంటి అన్ని విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా ఐటీ సదుపాయాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని మంత్రి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు సూచించారు. డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా రోగి పూర్తి వైద్య చరిత్ర అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు తక్షణమే సరైన చికిత్స అందించడానికి సౌలభ్యం కలుగుతుందని మంత్రి తెలిపారు.

## ప్రైవేట్ ఉద్యోగి డిజిటల్ అరెస్ట్

**రూ. 30 లక్షలు స్వాహా చేసిన సైబర్‌చీటర్స్**

మీరు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.. మీపై మహారాష్ట్ర యాంటీ టెర్రరిజమ్ స్కాడ్ కేసు నమోదు చేసిందని, దీంతో సుప్రీంకోర్టు ఫ్రీజ్ ఆర్డర్ జారీ చేసిందంటూ సైబర్‌నేరగాళ్లు ఓ ప్రైవేట్ ఉద్యోగిని డిజిటల్ అరెస్ట్ చేసి రూ. 30 లక్షలు స్వాహా చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగం చేసే వ్యక్తికి ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి(సైబర్‌నేరగాడు) ఫోన్‌చేసి..మీరు కెనెరా బ్యాంకు డెబిట్ కార్డు తీసుకున్నారని, దానిలో రూ.36 లక్షలు ఉన్నాయని, అంత డబ్బు ఎక్కడిదని అడిగారు. కార్డుతో తనకు సంబంధం లేదని, కెనరా బ్యాంకులో తనకు అకౌంట్ లేదంటూ బాధితుడు చెప్పాడు. మీరు వెంటనే ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు రావాలని , మీ ఆధార్‌కార్డు అక్కడ రిజిస్ట్రేషన్ అయ్యిందంటూ బెదిరించారు. మీ బ్యాంకు ఖాతాలు చెక్ చేయాలని, వెంటనే మీరు రూ. 30 లక్షలు డిపాజిట్ చేయా లని, మీకు నాన్ ఇన్వాల్‌మెంట్ సర్టిఫికేట్ జారీ చేస్తామని సూచించారు. మీరు చెప్పినట్లు ఈ కేసుతో ఎలాంటి సంబ ంధం లేదంటే మీ డబ్బులు మీకు తిరిగి వాపస్ వచ్చేస్తా యంటూ సూచించారు. సైబర్‌నేరగాళ్ల ఒత్తిడికి బయపడిన బాధితుడు అతని వద్ద ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు రద్దు చేసుకొని, రూ. 30 లక్షలు సైబర్‌నేరగాళ్లు సూచించిన ఖాతాలోకి బదిలీ చేశాడు. తేరుకున్న బాధితుడు ఇదంతా మోసమని గుర్తించి మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



# 'కారుణ్య మరణానికి' ఊపిరి!

అచేతన లేదా అర్ధ చేతన స్థితిలో జీవచ్ఛవాల్లా బతుకీడుస్తూ మనుగడ సాగించే రోగుల విషయంలో ఏం చేయాలన్న అంశంలో స్పష్టత కొరవడిన నేపథ్యంలో బుధవారం సర్వోన్నత న్యాయస్థానం ఉత్తరప్రదేశ్‌కు చెందిన 32 ఏళ్ల హరీశ్ రాణా అనే యువకుడి పరోక్ష కారుణ్య మరణానికి అనుమతిస్తూ చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. చావు బతుకుల పొలిమేరల్లో కొట్టుమిట్టాడేవారి విషయంలో ఏం చేయాలన్న మీమాంస మన దేశానికే పరిమితమైనది కాదు. దాదాపు అన్ని సమాజాల్లోనూ దశాబ్దాలుగా ఎడతెగని చర్చ కొనసాగుతోంది. 27 దేశాలు మాత్రమే కారుణ్య మరణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ చట్టాలు చేశాయి. వీటిలో 'క్రియాశీల కారుణ్య మరణానికి' కొన్ని మొగ్గు చూపగా, 'పాక్షిక కారుణ్య మరణానికి' మరికొన్ని అనుమతించాయి. 1973లో ముంబై కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్(కేఈఎం) ఆసుపత్రిలో నర్స్‌గా పనిచేస్తున్న అరుణా రామచంద్ర శాన్‌బాగ్ అనే యువతి లైంగిక దాడిలో తీవ్రంగా గాయపడి, మెదడుకు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి కోమాలోకి వెళ్లిన ఉదంతం అనంతరం ఈ విషయమై దేశంలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. ఆమెను నాలుగు దశాబ్దాల పాటు ఆసుపత్రి సహ సిబ్బంది కంటికి రెప్పలా చూసుకున్నారు. ఈ పరిస్థితుల్లో 2009లో ఆమె స్నేహితురాలు పింకీ విరానీ... అరుణా శాన్‌బాగ్‌కు కారుణ్య మరణాన్ని ప్రసాదించమని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చివరకు అసాధారణ పరిస్థితుల్లో కారుణ్య మరణానికి అనుమతినీయటం రాజ్యాంగబద్ధమేనని 2011లో న్యాయస్థానం అభిప్రాయపడింది. కానీ రోగి తరఫు బంధువులు కోరనందున ఈ తీర్పు బాధితురాలికి వర్తించబోదని తెలిపింది. ఎన్నో పరిమితులు విధించినా 2011 నాటి తీర్పు ఎన్నదగింది. అయితే 2018లో 'కామన్ కాజ్' దాఖలు చేసిన పిటిషన్ తర్వాత 'జీవించే హక్కు'కు పూచీపడే రాజ్యాంగంలోని 21వ అధికరణంలో 'హుందాగా మరణించే హక్కు' కూడా ఇమిడి ఉన్నదని తెలిపింది. దీనికోసం ఒక చట్టం చేయాలని కేంద్రానికి సూచిస్తూ, ఈలోగా వర్తింప జేయటం కోసం కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది. కానీ ఇప్పటివరకూ ఆ చట్టం జాడలేదు. ఆచరణలో ఆ మార్గదర్శకాల వల్ల ఎదురవుతున్న ప్రతిబంధకాలపై ఒక స్వచ్ఛంద సంస్థ పిటిషన్ దాఖలు చేశాక 2023లో అవి మరింత సరళమయ్యాయి. కానీ వాటి అమలుకు అనుమతించటం ఇదే ప్రథమం. పరోక్ష కారుణ్య మరణాన్ని అనుమతించటం విషయంలో నైతిక పరమైన సమస్యలు తలెత్తుతాయన్నది వాస్తవం. ఎందుకంటే గుండె, లేదా మెదడు 'సజీవంగా' ఉన్నట్టు వైద్యులు చెప్పాక చూస్తూ చూస్తూ అలాంటి రోగి మరణాన్ని ఎవరూ కోరుకోరు. ఏ క్షణమైనా కోలుకోవచ్చని ఆశిస్తారు. ప్రస్తుత కేసులో రోగి 13 ఏళ్లుగా అలాంటి స్థితిలోనే కొనసాగాడు. దీనిపై ఢిల్లీ హైకోర్టు అనుమతి నిరాకరించాక అతని తల్లితండ్రులు సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. తీర్పు వెలువరించినప్పుడు స్వయానా న్యాయమూర్తే కంటతడి పెట్టారంటే ఆయనలో సాగిన అంతస్సంఘర్షణ ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇక కన్నవారి గురించి చెప్పేదేముంది?



# చిచ్చు పెట్టొద్దు

బాలీవుడ్‌హీరోయిన్లు యామీ గౌతమీ, కృతి సనన్‌మధ్య సోషల్‌మీడియా వేదికగా వివాదం తలెత్తింది. ఇటీవల జరిగిన 'జీ సినీ అవార్డ్స్' వేడుకలో ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న కృతి సనన్ ఫొటోను యామీ గౌతమీ లైక్‌చేసింది. అయితే దీనిపై నెట్టింట పెద్ద దుమారమే రేపింది. ఈ వివాదం మరింత ముదురుతుండటంతో తాజాగా యామీ గౌతమీ క్లారిటీ ఇచ్చింది. 'నేను మరో నటిని తక్కువ చేసే విధంగా ఉన్న రీల్‌ను లైక్ చేశానని నా దృష్టికి వచ్చింది. నిజానికి ప్రతిరోజూ మమ్మల్ని వందలాది పోస్టుల్లో ట్యాగ్ చేస్తూ ఉంటారు. అవార్డు ఫంక్షన్ హడావిడిలో పొరపాటున ఆ వీడియోపై క్లిక్ అయి ఉండవచ్చు. అంతే తప్ప కావాలని చేసింది మాత్రం కాదు. నా కెరీర్‌లో ఎప్పుడూ ఇలాంటి చీప్ టెక్నిక్స్ వాడలేదు. నాకు అసలు పీఆర్ టీమే లేదు. అవార్డుల విషయంలో నా ఒపీనియన్ ఏంటో ఇప్పటికే చాలాసార్లు చెప్పేశాను. నేను ఎవరి మెప్పుకోసమే, గుర్తింపు కోసమో పనిచేయడం లేదు. నా పని మీద మాత్రమే నాకు నమ్మకం ఉంది. సోషల్ మీడియాలో వచ్చే గాసిప్స్ నమ్మవద్దు. క్లిక్‌బైట్ వార్తల కోసం గౌరవప్రదమైన నటీమణుల మధ్య చిచ్చు పెట్టొద్దు' అంటూ గౌతమీ వివరణ ఇచ్చింది.




# చిరంజీవికి ఎన్టీఆర్ పురస్కారం, కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు

తెలుగు చలనచిత్ర రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కళాకారులకు ఇచ్చే ప్రతిష్టాత్మక 'గద్దర్ అవార్డుల' (2025) విజేతల జాబితా శనివారం అధికారికంగా విడుదలైంది. ఈ ఏడాది అత్యున్నత పురస్కారాల్లో భాగంగా చిత్రసీమకు చెందిన ఇద్దరు దిగ్గజ నటులకు అరుదైన గౌరవం దక్కింది. తెలుగు సినిమాకు మెగాస్టార్ చిరంజీవి అందించిన అసమానమైన సేవలకు గుర్తింపుగా ఆయనను ప్రతిష్టాత్మకమైన 'ఎన్టీఆర్ జాతీయ పురస్కారం'తో ప్రభుత్వం సత్కరించనుంది. అలాగే వెండితెరపై తన విలక్షణ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న లోకనాయకుడు కమల్ హాసన్‌ను 'పైడి జయరాజ్ అవార్డు' వరించింది. ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ స్పెషల్ జ్యూరీ అవార్డుల వివరాలను ప్రకటించారు. 2025 జనవరి 1 నుండి డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలు, షార్ట్ ఫిల్మ్‌ల నుండి ఈ ఎంపిక జరిగింది. ఈ ప్రతిష్టాత్మక జాబితాలో నటి జయసుధకు 'ఏఎన్నార్ పురస్కారం', ప్రముఖ నిర్మాత అశ్విని దత్‌కు 'నాగిరెడ్డి చక్రపాణి అవార్డు', గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు 'సినారే అవార్డు' దక్కాయి. ఈ పురస్కారాలను ఈ నెల మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా ప్రదానం చేయనున్నారు.





# వెంకటేష్– అనిల్ రావిపూడి కాంబోలో మరో చిత్రం.



టాలీవుడ్‌లో విజయవంతమైన కాంబినేషన్‌లలో ఒకటిగా నిలిచిన విక్టరీ వెంకటేష్ అనిల్ రావిపూడి జోడీ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలను అందించిన ఈ కాంబినేషన్‌లో ఐదో సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు వెంకటేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2,ఎఫ్ 3వంటి చిత్రాలు భారీ విజయాన్ని సాధించాయి. అలాగే సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు వంటి చిత్రాలు కూడా ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు అదే జోష్‌తో మరో ఎంటర్‌టైనింగ్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించేందుకు దర్శకుడు అనిల్ రావిపూడి స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నందమూరి కళ్యాణ్ రామ్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఆయన పాత్ర కథలో కీలక మలుపు తిప్పేలా ఉంటుందని తెలుస్తోంది. వెంకటేష్ కళ్యాణ్ రామ్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక ఈ సినిమాలో వెంకటేష్ సరసన హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటించనున్నట్లు తెలుస్తోంది. మహానటి చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్ ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు సమాచారం. అయితే కళ్యాణ్ రామ్‌కు జోడీగా నటించే హీరోయిన్ ఎంపిక ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించనుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను సమీర్ రెడ్డి చేపట్టనున్నారు. నిర్మాణ బాధ్యతలను షైన్ స్క్రీన్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ప్రస్తుతం వెంకటేష్ నటిస్తున్న సినిమా పూర్తికాగానే ఈ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది. జూన్ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. అనిల్ రావిపూడి ప్రత్యేకమైన కామెడీ స్టైల్, వెంకటేష్ టైమింగ్ కామెడీకి తోడు కళ్యాణ్ రామ్ పాత్ర కూడా ఆసక్తికరంగా ఉండనుండటంతో ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# స్పెషల్ ఈవెంట్



'అమిగోస్' మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన కన్నడ కస్తూరీ ఆషికా రంగనాథ్.. ఫస్ట్‌సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల మనసులను కొల్లగొట్టింది. ఆతర్వాత 'నా సామిరంగా' తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది ఈ అందాల భామ. ఈ సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం 'విశ్వంభర'తోపాటు 'సర్దార్ 2' వంటి భారీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. ఇక సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉండే ఈ బ్యూటీ.. తాజాగా 'ఫర్ ఏ వెరీ స్పెషల్ ఈవెంట్' అంటూ కొన్ని ఫొటోలని ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేసింది. చేతిలో తెల్లని గులాబీ, ముక్కుకు ముక్కెరతో గుండె గిల్లుతున్న ఈ అందాల భామ లేటెస్ట్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది. లెహంగాలో మెరిసిపోతున్న ఆషికా అందానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.'అందమైన గులాబీ సంథింగ్ అమ్మడూ' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.